క్లుప్తంగా

పీ4 సర్వే వేగవంతం చేయండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని ప్రతీ గ్రామంలోనూ పేదరిక నిర్మూలనపై నిర్వహిస్తున్న పీ4 సర్వే వేగవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ కల్యాణి పిలుపునిచ్చారు. తన కార్యాలయంలోని సచివాలయ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో పని చేస్తున్న సిబ్బంది ప్రతీ ఒక్కరు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సచివాలయం పరిధిలో స్థానికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి, ఏఓ తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారు

చీపురుపల్లి: దక్షిణ హరిద్వార్‌గా పేరుగాంచిన మండలంలోని రామలింగాపురం, పుర్రేయవలస గ్రామాల మధ్య ఉన్న శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మానసాదేవి అమ్మవారికి ఎంతో ప్రత్యేకత కలిగిన రోజు కావడంతో తెల్లవారుజామున 3.45 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు బ్రహ్మ ముహూర్తంలో బ్రహ్మ గడియల్లో గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు.

ఘనంగా సిరుల ఎల్లమాంబ జాతర



సిరుల ఎల్లమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీపురుపల్లి: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన సిరుల ఎల్లమాంబ జాతర ఘనంగా జరిగింది. శుక్రవారం సిరుల ఎల్లమాంబ జాతరను పురస్కరించుకుని పట్టణంలోని కస్పావీధిలోని సిరుల ఎల్లమాంబ అమ్మవారి ఆలయంలో పూజారి అద్దూరి రామకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళల పట్ల గౌరవంగా మెలగాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఎంపీడీఓ బి.కల్యాణి, ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మహిళల పట్ల అందరూ గౌరవంగా మెలగాలని ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అన్నింటా మహిళలు రాణిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్‌లో మరింతా రాణించాలని ఆకాంక్షించారు. ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి, ఎంపీడీఓ బి.కల్యాణి, ఎంఈఓ విమలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిలకు శుభాకాంక్షలు

వేపాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలల ఉపాధ్యాయినిలకు పీఆర్‌టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఐ.అశోక్‌రాజు, మండల నేతలు మోహనరాజు, ఆకుల శ్రీను, పాల్ సుధాకర్, తాడి రాంబాబు తదితరులు బక్కునాయుడుపేట కేజీబీవీ పాఠశాలను, వేపాడ జెడ్పీ పాఠశాల తదితర పాఠశాలల ఉపాధ్యాయినిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా దినోత్సవం

రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్నా...



ఓ వైపు కుటుంబం.. మరో వైపు ఉద్యోగం.. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్నాను. కుటుంబాన్ని పోషించే భర్త దూరమవ్వడంతో 2015లో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. గూడ్స్ రైలుకి సంబంధించి సుమారు 53 బోగీలను ప్రతిరోజూ తనిఖీ చేయాలి. ఓ సారి విధి నిర్వహణలో ఉండగా రైలు యాక్సిల్ బాక్స్ నుంచి పొగలు రావడం గమనించాను. వెంటనే సమీపంలో ఉన్న అధికారులకు పరిస్థితి వివరించడంతో ప్రమాదం తప్పింది. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తుండడంతో 2023లో రైల్వే జీఎం అవార్డు వచ్చింది. ఇది వృత్తి నిర్వహణలో మరింత బాధ్యత పెంచింది.

– జి.లక్ష్మి, అసిస్టెంట్, రైల్వే సి అండ్ డబ్ల్యూ డిపార్ట్‌మెంట్, విజయనగరం

స్వశక్తితోనే అభివృద్ధి సాధించాలి



మహిళలు విద్య, వైద్యారోగ్య సామాజిక, రాజకీయ రంగాల్లో స్వశక్తితో అభివృద్ధి సాధించాలి. ప్రస్తుత సమాజంలో మహిళలు నింగి నుంచి నేల వరకూ ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నాయకత్వ ప్రతిభను చూపిస్తూ వారి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం మహిళల దినోత్సవం కేవలం మహిళను గౌరవించడమనే భావనతో జరిపేవారు. కానీ ప్రస్తుత సమాజంలో మహిళా దినోత్సవం మహిళలు సాధించిన అభివృద్ధిని, మహిళలకు ఉన్న సత్తాను గుర్తించి వారికి కూడా సమాన స్థాయిని ఇవ్వండని కోరుతూ నిర్వహించుకోవడం ఆనందదాయకం.

– లక్ష్మినరేన్ బెల్లాన, ఫ్యామిలీ అండ్ ఉమెన్స్ స్పెషలిస్ట్, లయన్స్ ఇంటర్నేషనల్, విజయనగరం

రేషన్.. బియ్యంతో సరి!

- పంచదార అర కిలో.. అంతే..
- మూడు నెలలుగా అందని కంది పప్పు



ఎస్.కోటలో ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకందే రేషన్ నుంచి సంక్షేమ పథకాల వరకు ఒక్కో దానికి వాతలు పెడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డిపోల ద్వారా బియ్యం, పంచదార, కంది పప్పు, శనగలు, రాగులు, జొన్నలు, గోధుమలు ఇలా...అన్ని ఇస్తాం అంటూ గొప్పలు చెప్పిన కూటమి బాబులు గతంలో ఇచ్చేవి కూడా ఇవ్వకుండా సున్నం రాస్తోంది.

మూడు నెలలుగా ఉడకని పప్పు

జిల్లాలో జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో కంది పప్పు పంపిణీ చేయలేదు. దీంతో పేదల ఇంట్లో పప్పు అన్నం కరువైంది. పేదలకు కాస్తంత ఆరోగ్యం, బలం ఇచ్చే సరుకు కందిపప్పు. అది కూడా కరువై పేద, మధ్య తరగతి వర్గాల వారు అల్లాడుతున్నారు. టెండర్లు ఖరారు కాలేదని సర్కారు ఈ నెల కూడా పప్పు ఇవ్వలేమని చేతులు ఎత్తేసింది. మూడు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిపేయటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలవర పెడుతున్న కందిపప్పు ధర

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కంది పప్పు ధర కలవరపెడుతోంది. మార్కెట్లో కందిపప్పు కిలో రూ.110 నుంచి రకాలను బట్టి రూ.160లు వరకూ ఉంది. దీంతో సామాన్యులు పప్పు మెతుకులు తినాలన్నా, పప్పుచారుతో కడుపు నిండా భోంచేయాలన్నా బెంబేలెత్తిపోతున్నారు. రేషన్ డిపోల ద్వారా కిలో కందిపప్పు రూ.70లు చొప్పున ఒక్కో కార్డుకు ఒక కిలో చొప్పున ఇచ్చేవారు. కొత్త సరుకుల మాటెలా ఉన్నా పాత సరుకుల్లో కోతలు పెట్టకుండా చూడాలని రేషన్‌కార్డుదారులు మొత్తుకుంటున్నారు.

జిల్లాకు 5,71,240కిలోల కందిపప్పు అవసరం

జిల్లాలో 1249 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా 5,71,240 మంది కార్డుదారులు సరుకులు తీసుకుంటున్నారు. వీరికి నెలకు 5,71,240 కిలోల కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. కాగా ప్రతినెలా 80 నుంచి 90శాతం ఇండెంట్ పెడుతున్నారు. మూణ్ణెళ్లుగా అది కూడా రాకుండా నామం పెట్టేశారు. కార్డుదారులకు ప్రస్తుతం ఇస్తున్న అర కిలో పంచదారను కిలో చేయాలన్న డిమాండ్ చాలా రోజులుగా ఉంది. పంచదార పెంచలేదు సరికదా పప్పుకి ఎసరు పెట్టేశారని ప్రజలు గోల పెడుతున్నారు.

ఇదేం తీరు..!



ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు పేదలకు ఇచ్చే పప్పు ఆపేయటం ఎంతవరకు సమంజసం. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్న ప్రభుత్వానికి కందిపప్పు నిల్వలు ఎంత కావాలి. వాటిని ఎలా సర్దుబాటు చేయాలో తెలియదా... కంది పప్పుతో పాటూ గతంలో చెప్పినట్టు గోధుమలు, రాగులు, జొన్నలు, శనగలు ఇవ్వాలి.

– చింతల సత్యవతి, సీతంపేట

కందిపప్పు రాలేదు

మార్చి నెలకు సంబంధించి కందిపప్పు రాకపోవటంతో కార్డుదారులకు ఇవ్వటం లేదు. ప్రభుత్వం ఎప్పుడు సరఫరా చేస్తే అప్పుడు కార్డుదారులకు ఇస్తాం. ప్రస్తుతం బియ్యం, పంచదారలు పంపిణీ చేస్తున్నాం.

– ఎల్.వి.జయలక్ష్మి, సీఎస్‌డీటీ, ఎస్.కోట

పశువైద్య విద్యార్థుల ఆందోళనకు మద్దతు



గరివిడిలోని పశు వైద్య కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పశు వైద్య కళాశాల విద్యార్థుల ఆందోళనకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపారు. అన్ని ఆరోగ్య సంబంధిత విభాగాలలో చదువుతున్న విద్యార్థులకు స్టైఫండ్ రూ.25 వేలు ఇస్తున్నారని, ఒక్క పశు కళాశాల విద్యార్థులకు మాత్రం రూ.7వేలు స్టైఫండ్ ఇవ్వడం సమంజసం కాదన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకి, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, రమణ, మధు, నాని, నీలిమ ఉన్నారు. – చీపురుపల్లి రూరల్ (గరివిడి)

పక్కాగా వర్క్ ఫ్రమ్ హోం సర్వే



వర్క్ ఫ్రమ్ హోం సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు సూచించారు. మెరకముడిదాం మండల కేంద్రంలో, సోమలింగాపురం, బుధరాయవలస సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. పలు సూచనలు చేశారు. పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. – మెరకముడిదాం

ఉపాధిలో సాగు పనులకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రస్తుతం చెరువు అభివృద్ధి పనులను తాత్కలికంగా నిలిపినట్లు తెలిపారు. రైతులకు సంబంధించి మామిడి, జీడి తోటల్లో కందకాలు, మొక్కలు చుట్టు గొప్పులు, గట్లు అభివృద్ధి పనులు, నీటి నిల్వ ట్యాంక్‌లు వంటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మామిడి, జీడి, కొబ్బరి వంటి మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. వేతనదారులకు పనివేళల్లో మార్పులు చేశామన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 11.30 వరకు అలాగే సాయింత్రం 4.30 నుంచి ఆరు గంటల వరకు పనులు చేపట్టాలని చూచించారు. పని ప్రదేశాలల్లో తాటాకు పందెళ్లు వేసుకోవాలన్నారు. ఉపాధి హామీ ఏపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'ఓపెన్' హాల్‌టిక్కెట్లు తీసుకోవాలి

చీపురుపల్లి: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం నేతృత్వంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విధానంలో భాగంగా పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఫీజులు చెల్లించిన అభ్యర్థులు హాల్ టిక్కెట్లు తీసుకోవాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గల ఓపెన్ స్కూల్ కేంద్రంలో అభ్యర్థులు హాల్‌టిక్కెట్లు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 17న హిందీ, 19న ఇంగ్లీష్, 21న తెలుగు, 24న గణితం, 26న సైన్స్, 29న సోషల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

భూఆధార్ నమోదు చేసుకోండి



గిట్టుపల్లిలో అవగాహన ర్యాలీ

బొండపల్లి: భూఆధార్ నమోదుకు సంబంధించి అర్హులైన జిరాయితీ భూములు కలిగి ఉన్న రైతులంతా త్వరగా తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఓ పి.వి.మల్లిఖార్జునరావు సూచించారు. మండలంలోని గరుడుబిల్లి, గిట్టుపల్లి గ్రామాల్లో శుక్రవారం భూఆధార్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవగాహన ర్యాలీలను నిర్వహించారు. భూఆధార్ నమోదు చేయించుకుంటే రైతులుకు 11 అంకెలు విశిష్ట సంఖ్య కేటాయించడం జరుగుతుందని దీని ద్వారానే రైతులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. మండల వ్యాప్తంగా ఇంకా 35 శాతం మంది రైతులు వివరాలను ఆన్‌లైన్ చేసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎఈఓ సంతోష్ కుమార్, గిట్టుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి కృష్ణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి

గంట్యాడ: సారా నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ శాఖ సీఐ ఎం.విజయలక్ష్మి కోరారు. మండలంలోని అడ్డతీగల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సారా తయారీ చేసినా.. అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సర్పంచ్ ఎస్. సన్యాసిరావు, పాఠశాల హెచ్ఎం సిహెచ్.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే స్థాయి కూటమి నేతలకు లేదు..

- వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కూటమి నేతలకు లేదని వైఎస్సార్ సీపీ వలంటీర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాధరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దన్నాన జనార్దనరావు అన్నారు. పార్టీ స్థానిక కార్యాయలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ నేత రామ్‌మల్లిక్ నాయుడు, జనసేన నాయకుడు విజనగిరి శ్రీనివాసరావుకు లేదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అసెంబ్లీలో ప్రశ్నించేందుకు ప్రతిపక్ష హోదా అడిగితే భయపడి ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు సరికదా పత్రికా సమావేశాల్లో జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు కనీసం అధికార కూటమి ప్రభుత్వం సమాధానం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతోందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్న జనసేన నాయకుడు కనీసం తన సొంత వార్డులో మెంబర్‌గా కూడా గెలవలేదని అలాంటి వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి కోసం విమర్శలు చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి ప్రారంభమైందని, ఎన్నికల సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘుమండ త్రినాధరావు, గవిడి సురేష్, రేవల్ల సత్తిబాబు, కోరుకొండ దాలయ్య, దీనుపల్లి రాము, గవిడి రామకృష్ణ, వెంకీ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జామి ఎల్లారమ్మ జాతర



వేపాడ: జామి ఎల్లారమ్మను దర్శించుకున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: చల్లని తల్లి భక్తుల కొంగుబంగారం జామి ఎల్లారమ్మ అమ్మవారిని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు. ప్రజలు ఆయురారోగ్యంగా వుండాలని, పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. ఎంపీపీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజంకి శ్రీను అమ్మవారిని దర్శించుకున్నారు.

గుర్లలో..

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో కొలువైనా ఎల్లమ్మ తల్లి జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు.

బొండపల్లిలో..

బొండపల్లి: నెలివాడ గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తితో పాటు ఎంపీటీసీ కోమ్మా నాగమణి, గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేడుకగా ఎల్లారమ్మ పెద్ద తీర్థం

శృంగవరపుకోట: ఎల్లారమ్మ జాతరలో శుక్రవారం పెద్ద తీర్థం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించేందుకు బారులు తీరారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ తండోపతండాలుగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖ టెంట్లు, బారికేడ్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, గ్రామ పంచాయితీ, దేవదాయ శాఖలు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఎల్లారమ్మ దర్శనం కోసం వచ్చిన భక్త జనం

క్వారీ టోల్‌గేట్లు ఎత్తేయాలని ఆందోళన



క్వారీ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

వేపాడ: రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో అమలు చేస్తున్న క్వారీ టోల్ గేట్లు ఎత్తివేయాలని జిల్లా క్వారీ అండ్ క్రషర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ చల్లా జగన్ డిమాండ్ చేశారు. సోంపురం క్వారీ వద్ద కార్మికులతో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో కార్మికులు, యజమానుల కష్టాలను నష్టాలను అర్థం చేసుకుని టోల్‌గేట్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతా ఒకే విధానాన్ని అమలు చేయాలని కోరారు. టోల్ గేట్లు వల్ల కార్మికులు, యజమానులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

10న విజయనగరంలో ఆటో కార్మికుల ధర్నా

శృంగవరపుకోట: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన జిల్లా కేంద్రం విజయనగరంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్.కోట పట్టణంలో బొడ్డవర స్టాండ్, పాత బస్టాండ్, బాబాగుడి వద్దనున్న ఆటో స్టాండ్‌లలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, చల్లా జగన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు రంగంలో ఉన్న కార్మికుల స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. రావాడ సన్యాసిదేముడు, జి.నాయుడు, కె.దేముళ్లు, కె.గోపి, డి.అచ్చంనాయుడు, సన్యాసిరాజు, ఎం అప్పారావు, అప్పలసూరి, అచ్చిబాబు పాల్గొన్నారు.



ధర్నా వాల్‌పోస్టర్లు విడుదల చేసిన ఆటో డ్రైవర్లు, సిటు నాయకులు